క్లుప్తంగా

చెడిన పెరుగు తెచ్చిన ఉపద్రవం!

- మజ్జిగ చేసిన తాగి 24 మందికి అస్వస్థత
- పలమనేరు ఆస్పత్రిలో చికిత్స, అందరూ సురక్షితమే
- దీనినీ రాజకీయం చేసిన పచ్చ పార్టీ నేతలు

గంగవరం: మండలంలోని నలసానపల్లె శనివారం ఓ ఇంట్లో జరిగిన శుభకార్యంలో చెడిన మజ్జిగను సేవించిన 24మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు.. గ్రామంలోని ఈశ్వరయ్య కుమార్తె పెద్ద మనిషి కావడంతో ఇంట్లో కార్యక్రమాన్ని నిర్వహించి బంధుమిత్రులను ఆహ్వానించారు. భోజనాలకు ముందు ఎండగా ఉండడంతో ఓ ప్రైవేటు పాల డెయిరీకి చెందిన పెరుగు ప్యాకెట్లను నీళ్లలో కలిపి మజ్జిగ చేసి సేవించారు. అయితే ఆ ప్యాకెట్ల గడువు మీరి ఉండడంతో పెరుగు చెడిపోయింది. సేవించిన వారికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారికి చికిత్స చేయడంతో అందరూ సురక్షితంగా బైటపడ్డారని, చికిత్స అనంతరం వారంతా ఇళ్లకు వెళ్లినట్టు ఆర్ఎంవో శారద తెలిపారు. ఇదిలా ఉండగా అస్వస్థతకు గురైన వారంతా సీఎం సభకు వచ్చి మజ్జిగ తాగి ఇలా అయ్యారంటూ ఇక్కడి పచ్చ పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేశారు. అయితే వాస్తవాలు తెలుసుకోకుండా సీఎంపై బురదజల్లేందుకు ఇంత నీచంగా వ్యవహరిస్తారా? అంటూ టీడీపీ నేతల ట్రోలింగ్‌పై ప్రజలు మండిపడ్డారు.

టీడీపీ ప్రచార వాహనం బోల్తా



రామకుప్పం: మండలంలోని రామాపురం–గుట్టూరు తండా మార్గంలో శుక్రవారం రాత్రి టీడీపీ ప్రచార వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవరు స్వల్పగాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

పిడుగుపాటుకు 16 మేకలు మృతి



మేకల కళేబరాలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

వి.కోట: మండలంలోని రామనాథపురంలో శనివారం పిడుగుపాటుకు 16 మేకలు మృతి చెందాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు శంకరప్ప తన మేకలను నాయకనేరి అటవీ ప్రాంతంలో మేతకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో చౌడేశ్వరీగిడి వద్ద తలదాచుకుంటున్న మేకల మందపై పిడుగు పడింది. దీంతో 16 మేకలు అక్కడికక్కడే మృత్యువాతపడగా, శంకరప్పసైతం స్పృహతప్పి పడిపోయాడు. అనంతరం కొంతసేపటికి కోలుకున్న శంకరప్ప ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గాలీవానకు రాలిన మామిడి

బంగారుపాళెం: మండలంలో గాలీవానకు మామిడితోటల్లో కాయలు నేలపాలయ్యాయి. వర్షానికి తోడు ఈదురుగాలులకు తోటల్లో మామిడి కాయలు రాలిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసంవత్సరం పంట 10 శాతం కూడా రాలేదన్నారు. దీనికి తోడు రెండు రోజులుగా పెనుగాలులు వీస్తుండడంతో తోటల్లో కాయలు నేల రాలిపోయాయన్నారు. రాలిన మామిడికాయలను రైతులు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా స్థానిక మామిడి మార్కెట్‌కు తీసుకొచ్చారు. వ్యాపారులు రూ.7లకు కొనుగోలుచేస్తున్నారు. మార్కెట్ బయట వ్యాపారులు కిలో రూ.6లకు కొంటున్నారు. పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు వాపోయారు.

రచ్చబండ



సర్వేజనా గెలుపో భవంతు!

నోస్నేప్.. సుబ్బన్నా! మా ఊర్లో ఈమధ్య ఎవరో సర్వేవోళ్లంట..వోళ్లొచ్చి ఏ పార్టీకి ఓటేస్తావని తలతింటావుండారన్నా అన్నాడు రాజప్ప. మీ ఊర్లోనే కాదు సామి మా పల్లెలోకి ఇబ్బుటికి నలుగురైదు వచ్చి ఏపార్టీకి ఓటేస్తావని నన్నే అడిగినారు. హా.. నీవేం చెబితివి సుబ్బన్నా అన్నాడు. వాళ్లకేమబ్బా డబ్బు తీసుకొని సర్వేలకొస్తారు, మన మాటలు విని ఏదో పార్టీ గెలుస్తుందని రిపోర్టులిస్తారు. నాకేం తెలీదా ఆసర్వే చేసేవాళ్లు టీడీపీకి అనుకూలమోళ్లైతే సైకిల్‌కే అని చెప్పినా.. వైఎస్సార్లోళ్లైతే..ఫ్యాను బాగుందబ్బా ఈతూరి అని చెప్పినా అన్నాడు. వోళ్లకే అంత తెలివుంటే నాకేమీ లేదా? ఐదేండ్లకు ముందు చంద్రబాబు ఏమేమి చెప్పి ఏం జేసినాడు? మళ్లా జగన్‌మోహన్‌రెడ్డి ఏం హామీలిచ్చి ఎన్ని చేశాడు? వోళ్లిదరిలో మనలాంటి పేదోళ్లకు మేలు కలిగిందో నా మనసుకే తెలుసు.. నా మనసులోని మాట తెలవాలంటే 13వ తేదీ చూపిస్తా అన్నాడు. ఈ చర్చ పలమనేరులోని కదిరప్ప ఆస్పత్రి పక్కన టీకొట్లో ఆదివారం సాగింది. వీరిద్దరి సంభాషణ విన్న అక్కడున్న వాళ్లు ఏమప్పా సర్వే వోళ్లకు భలే చెప్పినారే.. మీరు ఉండాల్సినోళ్లయ్యా సామీ అంటూ టీ తాగేసి అక్కడ పెట్టి ఎవరి దోవన వారు వెళ్లిపోయారు. –పలమనేరు



బహిరంగ సభకు హాజరైన అశేష జనంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, వెంకటే గౌడ



వర్షం కురుస్తున్నా చెదరని అభిమానం



అన్నా.. జగనన్నా: యువత ఉత్సాహం



అక్క చెల్లెమ్మల అభిమానం

జగన్ ప్రభంజనం

సంక్షేమ సారథికి జన నీరాజనం

- మండుటెండను లెక్కచేయని జనం
- వైఎస్సార్ సీపీని ఆశీర్వదించిన వరుణుడు
- చంద్రబాబు కుట్రలను ఎండగట్టిన సీఎం

పలమనేరు: పలమనేరు పట్టణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో శనివారం జన ప్రభజనంగా మారింది. పట్టణంలోని ఏటు చూసినా జనసందోహంతో నిండిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం వచ్చారు. ఇదంతా చూసిన వరుణుడు పులకించి ఆశీర్వదించాడు. ప్రజల సెంటిమెంట్‌ను మరోసారి నిజం చేశాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సుయాత్రలో వచ్చిన జననేతకు జనం కేరింతల నడుమ వరుణుడు ఆత్మీయ స్వాగతం పలికాడు. హెలీప్యాడ్ నుంచి సీఎం వర్షంలోనే కిందికి దిగి జనాన్ని చూసి అభివాదం చేశారు. మళ్లీ మీరే సీఎం అంటూ జనం నినాదాలు చేశారు. టవర్‌క్లాక్ కూడలిలో కూడా వర్షంలో తడుస్తూనే జనం నీరాజనం పట్టారు.

- శనివారం పొద్దున పది గంటల నుంచే పలమనేరు పట్టణ నలుమూలలు జనంతో నిండిపోయింది.
- గంగవరం సాయిబాబా ఆలయం వద్ద హెలిప్యాడ్‌లో జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ కుటుంబీకులు, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ కుటుంబీకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర తదితరులు ఘన స్వాగతం పలికారు.
- మధ్యాహ్నం ఒంటి గంట వరకూ భగభగ మండిన సూర్యుడు సీఎం రాకతో శాంతించి మబ్బులు కప్పుకున్నాడు.
- సీఎం హెలీకాప్టర్ దిగగానే వర్షం మొదలైంది. దీంతో జనం వర్షంలో తడుస్తూనే జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.
- సభాస్థలం ముందు ఎటూ చూసిన అభిమానులు నీటిని చల్లుకుంటూ 'జెండాలు జత కట్టడమే' పాటకు నృత్యం చేస్తూ సందడి చేశారు.
- పలమనేరు సిద్ధమా? అని సీఎం అనగానే మేం సిద్ధమంటూ జనం ప్రతిస్పందించారు.
- ఫ్యాను గుర్తును చూపించి ఇదే మన గుర్తు అక్కా, చెల్లెమ్మా, అన్నా తమ్ముడూ, అవ్వాతాతా, స్నేహితులు.. అని సీఎం చెప్పగానే జనం ఫ్యాన్, ఫ్యాన్ అంటూ గట్టిగా బదులిచ్చారు.
- ।చంద్రబాబు గెలిస్తే చంద్రముఖి నిద్రలేస్తుందంటుంటే జనం నిజమే నిజమేనంటూ నినాదాలు చేశారు.
- నా తమ్ముడు వెంకటేగౌడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడు.. అంటూ తనకు ఎడమ వైపు ఉన్న వెంకటేగౌడ భుజాలు పట్టుకుని ఆయన్ను జనం వైపు తిప్పడంతో నమస్కరించాడు. అలాగే, కుడివైపు ఉన్న ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను పరిచయడం చేస్తూ ఆయన చేతులు పైకెత్తి వెంకటేగౌడ ఉన్న జనం వైపు తిప్పి నమస్కారం చేయించారు.
- సభ ముగిసే సమయంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫ్యాను సింబల్‌ను చూపుతూ గిరగిరా తిప్పడంతో జనం అదే విధంగా అనుసరించాడు.

ఇటు చూడు బాబూ.. వీధులన్నీ ఫుల్

ఈమధ్య ఎన్నికల ప్రచారం కోసం పలమనేరుకొచ్చిన చంద్రబాబు మాట్లాడతూ త్వరలో ఇక్కడికి జగన్ వస్తే జనం రావద్దని వీధులన్నీ ఖాళీగా ఉండాలని చెప్పారు. అయితే జనంతో నిండిపోయిన పట్టణంలోని నలుమూలలను చూసిన స్థానికులు మా జన్మలో ఇంతటి జనాన్ని చూడలేదబ్బా! అనుకోవడం వినిపించింది. చంద్రబాబు జనాన్ని రావద్దు అన్నందుకు 50 వేల మంది పైచిలుకు రావడం కొసమెరుపు.



వాహనం నుంచి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఉత్సాహంగా చేతులు ఊపుతున్న ప్రజలు



గెలుపు మనదే అన్నా..

వైఎస్సార్ సీపీలో చేరిక



గుడుపల్లె: తెలుగు దేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు చేరాయి. శనివారం మండలంలోని ఓయన్ కొత్తూరు పంచాయతీలోని 10 కుటుంబాలు, కంచిబందార్లపల్లెలో 20 కుటుంబాల వారు పార్టీ చేరారు. చంద్రబాబుకు 35 ఏళ్ల జెండా మోసినా ఒక్క పథకం కూడా తమకు అందలేదని, జగనన్న పాలనలో పేదల ఇంటికే పథకాలు వచ్చాయని, అందుకే తాము టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరినట్టు చెప్పారు.ఎమ్మెల్యేగా భరత్‌ను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామని, గ్రామాల్లో పర్యటించి పార్టీ విజయానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణ, సర్పంచులు , దేవప్ప నాయుడు, శ్రీనివాసులు, పార్టీ కన్వీనర్ రామచంద్రప్ప, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కుప్పం చిరునామాగా చేస్తాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

కుప్పం: తనను గెలిపిస్తే కుప్పాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని మల్లానూరు పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుప్పం ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని కరపత్ర ప్రచారంతో ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు. ప్రధానం కుప్పం ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగు, సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అలాగే కుప్పం ప్రత్యేక మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నింటినీ నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, పార్టీ మండల కన్వీనర్ మురుగేష్, స్థానిక నాయకులు శ్రీనువాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త గెలుపు కోసం భార్య ప్రచారం

ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ అర్హత కలిగిన ఆయా వర్గాల వారందరికీ బ్యాంకు ఖాతాల్లో వివిధ పథకాల రూపేణా నగదు జమ చేసిన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. శనివారం కుప్పం మున్సిపాలిటీలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారు మరోసారి జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. కుప్పంలోనే నివాసం ఉంటూ, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తున్న తన భర్తకు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి తమ కుటుంబం అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఓడిపోయినా..నమ్ముకున్న వారికి అండగా ఉండాలని తమ మామ చంద్రమౌళి చెప్పిన మాట కోసం భరత్ కుప్పానికి వచ్చి నివాసం ఉంటున్నారన్నారు. ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, తన భర్తకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



మల్లానూరులో కరపత్ర ప్రచారం చేస్తున్న భరత్, పార్టీ నాయకులు



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న భరత్ భార్య దుర్గ

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం..



శాంతిపురం: చౌడంపల్లెలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, పార్టీ నాయకులు ప్రచారం

శాంతిపురం: మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరు శనివారం కూడా కొనసాగింది. సోలిశెట్టిపల్లె, చౌడంపల్లెలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, పోడూరు, చెలిమివంకలో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. అలాగే ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో అన్ని పంచాయతీల్లోనూ ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా భరత్, ఎంపీగా రెడ్డెప్పకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

గుడుపల్లె మండలంలో..

గుడుపల్లె: ఎన్నికలలో మాట ఇచ్చి నిలబెట్టుకునే పార్టీకే మద్దతు ఇవ్వాలని కుప్పం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు నరేష్‌రెడ్డి కోరారు. శనివారం కుప్పిగానిపల్లె, పొగురుపల్లె, కంచిబందార్లపల్లెలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చి, ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారన్నారు. అయితే చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కి, వెబ్‌సైట్ నుంచి వాటిని తొలగించి, ప్రజలను వంచించిన హీన చరిత్ర ఆయనదన్నారు. విలువలు, విశ్వసనీయతకు జగన్ చిరునామా అయితే, వంచన, నమ్మక ద్రోహానికి చిరునామా చంద్రబాబు అని పజలు గుర్తెరాలని కోరారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, పార్టీ మండల కన్వీనర్ రామక్రిష్ణ, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచ్ శ్రీనివాసులు, పంచాయతీ పార్టీ కన్వీనర్ రామచంద్రప్ప, నాయకులు గోపి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గుడుపల్లె: కంచిబందార్లపల్లెలో ప్రచారం చేస్తున్న పరిశీలకులు నరేష్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో సమరోత్సాహం జోష్

- ఎన్నికల నేపథ్యంలో పార్టీశ్రేణుల్లో జోష్
- ఇదేం జనంరా సామీ అంటున్న స్థానికులు
- కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు చెప్పిన ఎమ్మెల్యే

పలమనేరు: ఎన్నికల సందర్భంగా ప్రచారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలమనేరు రాకతో పట్టణ చరిత్రలో ఇంతవరకు ఏ కార్యక్రమానికీ రానంతలా జనం వచ్చారు. దీంతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది. స్థానిక కుప్పం రోడ్డులోని చెరువు కట్టపై నుంచి, మదనపల్లె రోడ్డులో గంగవరం ఫ్లైఓవర్ నుంచి చిత్తూరు వయా గంటావూరు నుంచి, గుడియాత్తం రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ పట్టణం పూర్తిగా జనంతో నిండిపోయింది. సాధారణంగా టీడీపీ, కాంగ్రెస్ మీటింగులకు బయటి నియోజవర్గాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి అద్దెజనాన్ని తరలించేవారు. కానీ శనివారం జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార సభకు కేవలం నియోజవర్గంలోని ప్రజలు, ముఖ్యంగా మహిళలు 50 వేలకు మించి రావడం టీడీపీ శ్రేణులను బిత్తరపోయేలా చేసింది. ఇక్కడికి చంద్రబాబు ఎన్నికల ప్రచారానికి వచ్చినపుడు పదివేలమంది కూడా లేదు. ఇప్పుడు జగన్ నినాదంతో మార్మోగిన ప్రజలను చూసి టీడీపీ నాయకులు సైతం నోరెళ్లబెట్టాల్సి వస్తోంది. ఓ వైపు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హెలీ ప్యాడ్ దిగినప్పటి నుంచి వర్షం పడుతున్నా జనం కదల్లేదు. తమకు మేలు చేసిన జననేతను చూసేందుకు జనం జేజేలు పలికారు. దీన్ని చూసి వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో జోష్ పెరిగింది. ఊహించిన విధంగా వచ్చిన జనానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ నేతలు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, సీవీ కుమార్, సుభాష్ చంద్రబోస్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, ఎమ్మెఆర్ రెడ్డెప్ప, నియోజకవర్గంలోని పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాలు, అభిమానులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.



జనసంద్రంగా మారిన పలమనేరు



స్వచ్ఛందంగా వచ్చి జగనన్నపై అభిమానం చాటుతున్న మహిళలు

క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో తెలంగాణ దేవదాయశాఖ కమిషనర్



కమిషనర్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామి చిత్రపటం అందజేశారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి



గానుగచింతలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

రొంపిచెర్ల: ఓటు హక్కును ప్రజలు నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ సుకుమార్ అన్నారు. ఆయన శనివారం కేంద్ర బలగాలతో మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఓటర్లను బెదిరించినా, పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

జనసేన అభ్యర్థులను గెలిపించండి

పుంగనూరు: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని జనసేన రాజంపేట పార్లమెంటు కన్వీనర్ శ్రీనివాసరాజు కోరారు. శనివారం పట్టణంలో ఆయన స్థానిక అధ్యక్షుడు చిన్నారాయల్‌తో కలిసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

పిడుగుపాటుకు కాలిన ఇంటి సామగ్రి

పూతలపట్టు: పిడుగుపాటుకు ఇంట్లోని సామగ్రిలో కాలిపోయిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పూతలపట్టు మండలం రమణయ్యకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంనాయుడు ఇంటి పక్కన ఉన్న చింతచెట్టుపై శనివారం సాయంత్రం పిడుగుపడింది. ఈ ఘటనలో వారింట్లోని ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, టీవీ పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణం నష్టం కలగలేదు. రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు

ఓటర్ స్లిప్పులు తీసుకోవడం నేరమా?



చాను, వైఎస్సార్‌సీపీ కార్యకర్త

రొంపిచెర్ల: సచివాలయ ఉద్యోగుల దగ్గర ఓటర్ సిప్పులు తీసుకోవడం కూడా నేరమా..? అని బండకిందపల్లె వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాను ప్రశ్నించారు. ఈనాడు దిన పత్రికలో శనివారం ప్రచురితమైన స్లిప్పుల పంపిణీలో వైకాపా కార్యకర్త అనే వార్తపై ఆయన స్పందించారు. తన ఇంట్లో 10 ఓట్లు ఉన్నాయని, వాటికి సంబంధించిన స్లిప్పులనే బీఎల్ఓ వద్ద తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా అసత్యాలు ప్రచారం చేయడం తగదని స్పష్టం చేశారు.

గుడిపాలలో గాలీవాన బీభత్సం



గుడిపాల వద్ద నేలకొరిగిన వరిపంట

గుడిపాల: మండలంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు అధికంగా రావడంతో వరి, అరటి, కొబ్బరి, మామిడి చెట్లు విరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. మండలంలో చిత్తపార, పాపసముద్రం, పిళ్లారికుప్పం, గుడిపాల, వసంతాపురం, చింతగుంటూరు ప్రాంతాల్లో అధికంగా అరటిపంటలు దెబ్బతిన్నాయి. చిత్తపారలో కొబ్బరిచెట్టు విద్యుత్‌లైన్‌లపై పడడంతో విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి.



గాలికి విరిగిన మామిడిచెట్టు

జగనన్నకు మరోసారి పట్టం కట్టండి

- పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



తుంబకుప్పంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న సునీల్‌కుమార్, రెడ్డెప్ప



తుంబకుప్పంలో సునీల్‌కుమార్, రెడ్డెప్ప, లలితకుమారి ప్రచారం

బంగారుపాళెం: పేదలకు మేలు చేసిన జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప అన్నారు. శనివారం మండలంలోని తుంబకుప్పం పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వీరికి స్థానికులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా జగనన్న సంక్షేమ పథకాలు అందించారన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మితే భవిష్యత్ చీకటిమయమవుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనకు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సుగుణాకర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సర్పంచ్ లీలావతమ్మ, నియోజక వర్గ పరిశీలకులు మోహన్‌రెడ్డి, మండల పరిశీలకులు గాంధీబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రచారాల జోరు



కల్లూరులో ప్రచారం చేస్తున్న నేతలు



పుంగనూరు: చంద్రకాంత్‌వీధిలో అమ్ము ప్రచారం



పుంగనూరులో పీఆర్‌ఆర్ వారియర్స్ ప్రచారం

పుంగనూరు: ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా పార్టీ నేతలు ప్రచారాన్ని ఉధృతం చేసింది. శనివారం పట్టణంలోని చంద్రకాంత్‌వీధి, గోకుల్‌వీధిలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అలాగే రహమత్‌నగర్‌లో కౌన్సిలర్ సాజిదాబేగం, ఎంబీటీ రోడ్డులో దళిత నాయకుడు శంకరప్ప, మేలుపట్ల, కొత్తపేట క్రాస్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ సీఆర్.లలిత, పీఆర్‌ఆర్ వారియర్స్ డాక్టర్లు శివ, శరణ్, సుధాకర్‌రెడ్డి, త్రిమూర్తిరెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకటమిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నేతలు గోపాలకృష్ణ, రామకృష్ణ, నాన బాలగణేష్, కృష్ణారెడ్డి, భాస్కర్‌శెట్టి పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక రేగల్ రోడ్డులో ముస్లిం నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలేజీరోడ్డు, కొత్త గ్రామీణ బ్యాంకు వీధిలో సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఖమ్రుద్దీన్, ఖాజాపీర్, సయ్యద్‌బాషా, కాలేషా, అంజాద్, మునాఫ్, బాబు, రాజశేఖర్, కోదండ, రమేష్ పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అహ్మద్, సాకత్‌అలీ, షారుక్, మునీర్,చైతు, షాజహాన్, నజీర్, మహబూబ్‌బాషా, నిషార్, మున్ని, శీనా, ఫయాజ్, శేఖర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల కృష్ణమూర్తి కాలనీ, కొలిమి వీధుల్లో నేతలు ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నీలుఫర్, కరీముల్లా, లక్ష్మయ్య, చిన్న నాగరాజ, అలీంఖాన్, మస్తాన్, మల్లికార్జునరెడ్డి, వెంకటరత్నం, ఐడియా కాలేషా, గురు, హిమయత్ అలీబేగ్, సులేమాన్, బావాజీ, సిరాజ్‌వున్నీసా, మహబుబ్‌బాషా పాల్గొన్నారు.



పుంగనూరు ఎంబీటీ రోడ్డులో శంకరప్ప



సదుంలో ముస్లిం నేతల ప్రచారం



రొంపిచెర్లలో నేతల ప్రచారం

ముస్లింలకు జగనన్న పాలనలోనే రక్షణ



పుంగనూరులో ఎమ్మెల్సీ జకియాఖానం, ఫక్రుద్దీన్‌షరీఫ్

- ఎమ్మెల్సీ జకియాఖానం

పుంగనూరు: ముస్లిం మైనార్టీలకు రక్షణ, అభివృద్ధి జగనన్న పాలనలోనే అని ఎమ్మెల్సీ, డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానం అన్నారు. శనివారం ఆమె సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, కౌన్సిలర్లు రేష్మ, భారతి, రాఘువేంద్ర, సాజిదాబేగంతో కలిసి ఎన్ఎస్.పేట, కుమ్మరవీధి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ముస్లిం మహిళలతో ఇంటింటికీ వెళ్లి సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటమిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నేతలు అస్లాంమురాధి, రషీదాబేగం, గౌరమ్మ, నయాజ్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని ఆర్వో చిన్నయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పూతలపట్టు నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగులు మాత్రమే ఆసెంటర్ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి ఫారం 12, 12డీ, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ధ్రువీకరణ పత్రం, ఓటరు, ఆధార్ కార్డును సంబంధిత పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ రెండు రోజులు జరుగుతున్న కారణంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూతలపట్టులో 5మండలాలకు సంబంధించి 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 1,750 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నట్లు తెలిపారు.



ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తీసుకెళ్తున్న సిబ్బంది

గాలీవానకు రాలిన మామిడి



రాలిన మామిడికాయలు

బంగారుపాళెం: మండలంలో గాలీవానకు మామిడితోటల్లో కాయలు నేలపాలయ్యాయి. వర్షానికి తోడు ఈదురుగాలులకు తోటల్లో మామిడి కాయలు రాలిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసంవత్సరం పంట 10 శాతం కూడా రాలేదన్నారు. దీనికి తోడు రెండు రోజులుగా పెనుగాలులు వీస్తుండడంతో తోటల్లో కాయలు నేల రాలిపోయాయన్నారు. రాలిన మామిడికాయలను రైతులు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా స్థానిక మామిడి మార్కెట్‌కు తీసుకొచ్చారు. వ్యాపారులు రూ.7లకు కొనుగోలుచేస్తున్నారు. మార్కెట్ బయట వ్యాపారులు కిలో రూ.6లకు కొంటున్నారు. పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు వాపోయారు. మండలంలో 100 టన్నుల కాయలు రాలిపోయాయని అంటున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



తెల్లగుండ్లపల్లె ప్రచార ర్యాలీలో నేతలు

తవణంపల్లె: తెల్లగుండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గ్రామస్తులు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల పార్టీ ఇన్‌చార్జి జి.ప్రకాష్‌రెడ్డి ఎంపీపీ ప్రతాప్‌సుందరరాయల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, రమణారెడ్డి, సురేష్‌బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, కిషోర్ రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, కోదండ, క్రిష్ణమూర్తి యాదవ్, రమేష్‌నాయుడు, బాబునాయుడు, జగన్నాథనాయుడు, ఉమాపతినాయుడు, అమరేంద్రబాబు, రవిరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, తేజారెడ్డి, స్వరూప్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జీవ పాల్గొన్నారు.

తగ్గువారిపల్లెలో ప్రచారం..

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడ నుంచి ర్యాలీగా ప్రభుత్వ ఆస్పత్రి వరకు రోడ్ షో నిర్వహించారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: వైఎస్సార్సీపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేనూతనపల్లి పంచాయతీ పరిధిలో ప్రచారం ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. మండల సచివాలయం కన్వీనర్ సుధాకర్‌రెడ్డి సర్పంచ్ ప్రవీణ్, నేత నిరంజన్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు.



తగ్గువారిపల్లెలో సునీల్‌కుమార్, రెడ్డెప్ప ప్రచారం



నేతలకు హారతి పడుతున్న మహిళ





తెల్లగుండ్లపల్లెలో నేతల ప్రచారం, వేనూతనపల్లెలో నేతల ప్రచారం

వైఎస్సార్‌సీపీకే దళితుల మద్దతు

- ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు చెంగయ్య



చెంగయ్య

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ నాయకులకు దళితులంటే చులకన అని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కే.చెంగయ్య దుయ్యబట్టారు. ఆయన శనివారం పలు అంశాలపై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పై టీడీపీ నేతల ప్రాద్బలంతో కొందరు దళిత నాయకులు మాట్లాడడాన్ని ఖండించారు. టీడీపీ ప్రజాప్రతినిధులు ఏమైనా దేశభక్తులా అని ప్రశ్నించారు. పలువురు దళితులను టీడీపీ నాయకులు శిరోముండనం చేసి ఊర్ల నుంచి వెలివేశారని గుర్తు చేశారు. చంద్రగిరి మండలంలో దళిత మహిళలను చెప్పుతో కొట్టడం, ముంగిలిపట్లు గ్రామంలో దళిత యువకునిపై దాడి చేయడం, నారాయణవనం, నాగలాపురం మండలంలో మాదిగలను ఊరి నుంచి వెలివేయడం వంటి ఘటనలు చంద్రబాబు పాలనలో జరిగిందని గుర్తు చేశారు. వారి పై బాబు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. దళితుల భూములను అక్రమించి ప్రైవేటు సంస్థలకు బాబు అప్పగించలేదా అని ప్రశ్నించారు. ఇన్ని చేసిన టీడీపీ నాయకులు జగనన్నను ప్రశ్నించడమేమిటన్నారు. దళితుల మద్దతు వైఎస్సార్‌సీపీకు ఉంటుందని వివరించారు.